# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 90 బుధవారం 03, డిసెంబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com





## డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ

రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్ కు ప్రణాళికలు

రూ.850 కోట్లతో మహేశ్వరంలో 'జేఎస్ డబ్ల్యూ యూఏవీ ఫెసిలిటీ'

ఏటా 300 వరకు వీటీఏటీ డ్రోన్ల ఉత్పత్తి... కొత్తగా 300 మందికి ఉద్యోగాలు

'భూమి పూజ' కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణను 'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అడ్వాన్స్ డ్ అన్ మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్, డిఫెన్స్ ఇన్నోవేషన్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చేలా 'ఎకోసిస్టం'ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. మంగళవారం జేఎస్ డబ్ల్యూ, షీల్డ్ ఏఐ సంయుక్తంగా రూ.850 కోట్లతో మహేశ్వరంలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్(ఈఎంసీ)లో ఏర్పాటు చేయనున్న 'జేఎస్ డబ్ల్యూ



# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట

సమర్థులను సర్పంచ్‌లుగా ఎన్నుకోండి

ముఖ్య శాఖలన్నీ ఈ జిల్లా నుంచే ఉన్నాయి

ఏ పని కావాలన్నా క్షణాల్లో జరగడం ఖాయం

ప్రాజెక్టులతో కేసీఆర్ కుటుంబంలో కనకవర్షం కురిసింది

తెలంగాణ రైతులకు ఏ ఉపయోగం జరగలేదు

ప్రాజెక్టులు కట్టింది నెహ్రూ పాలనలోనే..

కొత్తగూడెం సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాస్వరం

సమర్థులను సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని పేర్కొన్నారు. ముఖ్య శాఖలన్నీ ఈ జిల్లా నుంచే ఉన్నాయన్నారు. ఏ పని కావాలన్నా క్షణాల్లో జరగడం ఖాయమని తెలిపారు. ప్రాజెక్టులతో కేసీఆర్ కుటుంబంలో కనకవర్షం కురిసిందని.. తెలంగాణ రైతులకు ఏ ఉపయోగం జరగలేదని చెప్పారు ప్రాజెక్టులు కట్టింది నెహ్రూ పాలనలోనేనని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లాను తిరిగి అభివృద్ధిపథంలో నడిపించడం తన ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కొత్తగూడెంలో దేశంలోని ఏకైక భూవిజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని 'డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ప్రారంభించిన అనంతరం జరిగిన భారీ ప్రజాసభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 60 ఏళ్లపాటు

## కేసులకు భయపడం

రాహుల్, సోనియాపై బీజేపీ కక్ష గట్టింది

కేంద్రం నుంచి నిధులు రావడం లేదు

ఇచ్చే వరకూ అడుగుతూనే ఉంటాం

తెలంగాణలో బీజేపీని భూస్థాపితం చేస్తాం

పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



## పనుల్లో వేగం, నాణ్యత, స్పష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

టీజీ రైజింగ్ వార్ రూమ్ సందర్శించిన భట్టి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష

పనుల్లో వేగం.. నాణ్యతపై దృష్టి

రేపటి నుంచి మంత్రుల పర్యవేక్షణ

హైదరాబాద్, ప్రజాస్వరం:

ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్' ను మంగళవారం డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సందర్శించారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపుదిద్దుకునే ఈ కీలక కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. విజన్ డాక్యుమెంట్

మిగతా 2లో..

## అంచలంచలుగా ఎదిగిన నాట్య మయూరి

భరతనాట్యంలో తనదైన ముద్ర

వేస్తున్న కామెడీ నిత్యవరలక్ష్మిరెడ్డి

"చదువు, నాట్యం రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు"



## తెలంగాణ రాజ్‌భవన్.. ఇక 'లోక్‌భవన్'

వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంతో పేర్లు మార్చాలని కేంద్రం నిర్ణయం

లోక్ భవన్, లోక్ నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర హోంశాఖ లేఖ

ఇప్పటికే పేర్లు మార్చిన బెంగాల్, తమిళనాడు, గుజరాత్, కేరళ, అసోం, త్రిపుర, ఒడిశా




## కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు వేగవంతం



టెక్స్‌టైల్ పార్క్‌తో వేల ఉద్యోగాలు

పీఎంమిత్ర పథకం కింద కేంద్రం రూ. 200 కోట్ల కేటాయింపు

మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబడులతో 12,500 ఉద్యోగాలు

దక్షిణ కొరియా కంపెనీల నుంచి భారీగా పెట్టుబడులు

హైదరాబాద్, ప్రజాస్వరం:

హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రతిష్ఠాత్మక కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు, ముఖ్యంగా మహిళలకు భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పీఎంమిత్ర (PM MITRA) పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపికైన 7 మెగా టెక్స్‌టైల్

మిగతా 6లో..




## సైబర్ ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

రాష్ట్రంలో 8శాతం తగ్గిన సైబర్ నేరాలు..

58వేల ఎఫ్‌ఐఆర్లు, రూ.350కోట్లు రిఫండ్

6వారాల పాటు సైబర్ అవగాహన కార్యక్రమాలు

ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన డీజీపీ డీజీపీ శివధర్ రెడ్డి

ప్రజాస్వరం తెలంగాణ బ్యూరో :

సైబర్ నేరాల నియంత్రణ పై అవగాహన కలిగించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ( టీజీసీఎస్బీ) ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాఫ్ ప్రచార కార్యక్రమాన్ని డీజీపీశివధర్ రెడ్డి ప్రారంభించారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్




# సైబర్ ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

మొదటిపేజీ తరువాయి

సెంటర్లో సైబర్ సెక్యూరిటీ డీజీ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఫ్రాడ్ కా ఫుల స్టాప్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగా స్వాములు కావాలని పిలుపునిచ్చారు. 6వారాల పాటు నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్లు పాల్గొనాలని తెలిపారు. అనుమానస్పద సోషల్ మీడియాలో వచ్చే లింకులకు, ఆర్థిక ఆఫర్లకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రేడింగ్ ఫ్రాడ్ తో ఓ వ్యక్తి రూ.14కోట్ల నష్టపోయిన సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేశాడని వివరించారు. సాఫ్ట్ వేర్గా చేస్తున్న 30ఏళ్ల యువతితో ఓ వ్యక్తి సన్నిహితంగా మెలిగి రూ.40లక్షల రుణాలు తీసుకుని మోసం చేశాడని తెలిపారు. ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో దేశంలో అగ్రగామిగా ఉన్నామని అందుకు కృషి చేస్తున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరోను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల నియంత్రణ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆరు వారాల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాలలో డిజిటల్ అరెస్ట్ , ఇన్వెస్ట్మెంట్ మోసాలు, ఓటీపీ/కెవైసి మోసాలు, లోన్ యాప్ హెరాస్మెంట్ , సోషల్ మీడియా ఎక్స్ టార్షన్ వంటి ప్రధాన మోసాలపై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**రాష్ట్రంలో 8శాతం తగ్గిన సైబర్ నేరాలు – టీజీసీఎస్బీ డీజీ శిఖా గోయల్**

దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలు 29శాతం పెరిగాయని అదే సమయంలో రాష్ట్రంలో 8శాతం తగ్గాయని డీజీ శిఖా గోయల్ వెల్లడించారు. ఆర్థిక నష్టం దేశ వ్యాప్తంగా 6శాతం తగ్గితే రాష్ట్రంలో 30శాతం తగ్గినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పడిన నాటి నుంచి .244లక్షల ఎన్సీఆర్పి ఫిర్యాదులు అందాయని , 58,244 ఎఫ్ఐఆర్లు నమోదు అయినట్లు వెల్లడించారు. సైబర్ బాధితులకు రూ.350కోట్ల రిఫండ్ చేసినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో విద్యార్థుల కోసం స్టూడెంట్ ప్రోగ్రామ్ ఫర్ అవేర్ నెస్ అండ్ రెస్పాన్సిబుల్ సైబర్ స్పేస్( స్పార్క్ సైబర్ క్లబ్స్) ప్రారంభించమన్నారు. విద్యార్థులను స్కూళ్లు , కాలేజీలు సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. ఎస్బీఐ భాగస్వామ్యంతో సిబ్బందితో సైబర్ డిఫెండర్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఎ డైరక్టర్ అబిలాష బిస్త్, ఇంటిలిజెన్స్ ఏడీజీపీ విజయ్ కుమార్, టీజీ నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా, హైదరాబాద్ సీపీ సజ్జనార్ , సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐసీసీసీ డైరక్టర్ కమల్ హసన్ రెడ్డి, మాజీ ఐపిఎస్ ఎఆర్ శ్రీనివాస్ , ఐజీ రమేష్ నాయుడు, ఈగల్ డీఐజీ అభిషేక్ మహంతి, డీసీపీలు అరవింద్ బాబు, సుధీంద్ర, నాగలక్ష్మీ, ఎస్సీలు హర్షవర్ధన్, సాయిశ్రీ పాల్గొన్నారు.

ఆరు వారాల పాటు నిర్వహించే కార్యక్రమాలు

మొదటీ వారం - సైబర్ సారధి@1930 - గోల్డెన్ అవర్ రిపోర్టింగ్ , 1930 హెల్ప్ లైన్
2వ వారం - స్కామ్ సే బచో - డిజిటల్ అరెస్ట్ , సెక్స్టార్షన్ సైబర్ స్లేవరి
3వ వారం - పైసా పైలం - ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ , లోన్ యాప్స్ , ఫేక్ రివార్డ్స్
4వ వారం- హర్ స్క్రీన్ సురక్షా - హ్యాకింగ్ ,రామ్సమ్వేర్ , ఫేక్ యాప్స్ , బెట్టింగ్
5వ వారం- మెరా లాగిన్ మేరా రూల్ - ఐడెంటిటీ థెఫ్ట్ , ఇన్ ఫర్మేషన్ , ఓటీపీ, కెవైసి మోసాలు
6వ వారం - మహిళ రక్షణ పిల్లల సంరక్షణ - మహిళలకు, పిల్లలకు , సంబంధించిన ఆన్లైన్ ముప్పులు




# డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్ (యూఏవీ) ఫెసిలిటీ' భూమి పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... డ్రోన్లు, శాటిలైట్లు, సైబర్ సిస్టమ్స్, ఏఐ అనేవి ఇకపై భవిష్యత్తు సాంకేతికతలు కావని, అవి ఇప్పటికే ఆధునిక యుద్ధాల నిర్వహణ వ్యవస్థగా మారాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో డ్రోన్ల తయారీలో స్వయం సమృద్ధిని సాధించడం జాతీయ భద్రతకు అత్యంత అవసరమన్నారు. 2030 నాటికి దేశీయ డిఫెన్స్ యూఏవీ, డ్రోన్ మార్కెట్ వాల్యూ 4.4 బిలియన్ డాలర్లు, 5 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశముందన్నారు. ఈ పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఎల్బిట్ సిస్టమ్స్, షీబెల్ లాంటి అంతర్జాతీయ డిఫెన్స్ దిగ్గజ సంస్థల తయారీ కేంద్రాలు హైదరాబాద్ లో ఉండటం 'రైజింగ్ తెలంగాణ'కు నిదర్శనమన్నారు. ఈ 16 ఎకరాల స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీలో ఏటా 300 వరకు వీబీఏటీ డ్రోన్లు తయారవుతాయన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఇక్కడ ఉత్పత్తి మొదలవుతుందని, ప్రొడక్షన్, రీపేర్, టెస్టింగ్... ఇలా అన్ని ఒకేచోట అందుబాటులో ఉంటాయన్నారు. కొత్తగా 300 మందికి హైవాల్యూ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ ఫౌండర్ పార్థ్ జిందాల్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ఆశించిన స్వరాష్ట్ర కలను నెరవేర్చడానికి కీలక పాత్ర పోషించిన మాజీ ప్రధాని డా. మన్మోహన్సింగ్కు గౌరవ సూచకంగా ఈ వర్సిటీని ఆయన పేరుతో ఏర్పాటు చేశామని తెలిపారు. "తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది ఈ నేలలోనే. రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన మన్మోహన్సింగ్ పేరును ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థకు పెట్టుకోవడం మా ప్రభుత్వం గర్వంగా భావిస్తోంది" అని చెప్పారు.

**విద్య, సాగునీరు, తెలంగాణ భవిష్యత్తును మార్చే రంగాలు**

ఇరిగేషన్ మరియు ఎడ్యుకేషన్ రంగాలు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే పునాది స్తంభాలని సీఎం పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు శాశ్వత నీటి భద్రతను అందిస్తామని హామీ ఇచ్చారు. "భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా... ఖమ్మం అభివృద్ధి నా బాధ్యత. ఈ జిల్లాలో పాలనకు ప్రాణాధారమైన శాఖలన్నీ మీ మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి.



అందుకే అభివృద్ధిలో ఆలస్యం జరగదు"* అని ధృవీకరించారు.

**ముందు మంచి పాలన, తరువాతే సంక్షేమం**

ప్రజలు రెండేళ్ల క్రితం ఇచ్చిన ఓటుతోనే రాష్ట్రంలో మంచి పాలన ప్రారంభమైందని సీఎం పేర్కొన్నారు. "సర్కారు బలంగా ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు— ఇవన్నీ అందుతాయి. ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చే ప్రతి పథకం మంచి ప్రభుత్వంతోనే కొనసాగుతుంది" అని అన్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భాన్ని ప్రస్తావిస్తూ ఆయన గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధికి మంచి నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. "గ్రామాల్లో సర్పంచ్లు కూడా మంచివాళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే నాయకత్వం ఉన్న చోటే అభివృద్ధి జరుగుతుంది. రాజకీయ కక్షలు పక్కన పెట్టి పదేళ్లు అభివృద్ధికి అండగా నిలబడండి" అని కోరారు.

**సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వం మద్దతు కోరింది**

రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపించగల నాయకులను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. "తుమ్మల నాగేశ్వరరావు గారు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారితో కలిసి పనిచేసే మంచి సర్పంచ్లు వస్తేనే గ్రామాలు మారుతాయి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్గా నిలబెట్టడానికి నాయకత్వం బలపడాలి"* అన్నారు.

**ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కొత్తగూడెం ప్రాంతంలో ఇంత పెద్ద సందడి కనిపించడం ఇటీవల కాలంలో అరుదని నిర్వాహకులు తెలిపారు.

# కేసులకు భయపడం

- రాహుల్, సోనియాపై బీజేపీ కక్ష గట్టింది
- కేంద్రం నుంచి నిధులు రావడం లేదు
- ఇచ్చే వరకూ అడుగుతూనే ఉంటాం
- తెలంగాణలో బీజేపీని భూస్థాపితం చేస్తాం
- పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాస్వరం




కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీలపై కేంద్ర సంస్థలు పెట్టిన కేసులపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ''ఎన్ని కేసులు పెట్టినా, ఎంత ఒత్తిడి తెచ్చినా గాంధీ కుటుంబం వెనుకడుగు వేయదు. దేశం కోసం వాళ్ల కుటుంబం చేసిన త్యాగాలను ఎవరూ చెరపలేరు'' అని ఆయన అన్నారు. గాంధీభవన్లో జరిగిన కీలక సమావేశంలో సీఎం రేవంత్రెడ్డి ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్పై రాజకీయ ప్రతీకార వేట నడుపుతోందని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసు అసలు వివరాలను ప్రస్తావిస్తూ స్పష్టమైన వివరణ ఇచ్చారు. "నేషనల్ హెరాల్డ్ పత్రిక చాలా ఏళ్ల కిందటే మూతపడింది. ఆ పత్రికలో పని చేసిన ఉద్యోగులు రిటైర్మెంట్ ప్రయోజనాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు సంస్థలలో పనిచేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవు. అందుకే వారిని ఆదుకోవాలని కాంగ్రెస్ మంచిఆలోచనతో ముందుకొచ్చింది" అని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిధులను పూర్తిగా పారదర్శకంగా వినియోగించిందని కూడా వివరించారు.

"షేర్ క్యాపిటల్ కింద కొన్ని మొత్తాలను బదిలీ చేసి ఆ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చాం. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ నిధి కాదు. ఎవరి జేబులోకి డబ్బు వెళ్లలేదు. అన్ని ఆస్తులు నెహ్రూ కుటుంబ వారసత్వం. ఆ పత్రికను తిరిగి నడపాలని మాత్రమే ప్రయత్నించారు" అని సీఎం స్పష్టం చేశారు. రాహుల్ సోనియా గాంధీ మీద బీజేపీ పగబట్టిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని పేర్కొన్నారు. నిధులు వచ్చేవరకు కొట్లాడుతూనే ఉంటామని చెప్పారు.

**మనీలాండరింగ్ కాదు, రాజకీయ వేధింపు**

కేంద్రం పెట్టిన మనీలాండరింగ్ కేసులు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని రేవంత్రెడ్డి వ్యాఖ్యానించారు. "సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను బలహీనపరచాలనే ఉద్దేశంతో ఈ కేసులు పెట్టారు. ఎన్నికలకు ముందే ప్రజల దృష్టి మరల్చేందుకు ఈ కుట్ర. అయినా గాంధీ కుటుంబం ధైర్యం కోల్పోలేదు. పూర్తిస్థాయి న్యాయపోరాటం చేస్తోంది"* అని అన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ, ప్రజాస్వామ్య వ్యవస్థ క్షీణతపై రాహుల్ గాంధీ చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవడానికే ఈ విచారణలు మళ్లీ ప్రారంభించారని ఆయన విమర్శించారు. "ఓట్లదోపిడీకి వ్యతిరేకంగా రాహుల్ గట్టిగా మాట్లాడుతున్నారు. అదే కారణంగా మళ్లీ కొత్త కేసులు పెట్టి వేధిస్తున్నారు"* అని ఆరోపించారు.

**ప్రధానికి లేఖ రాస్తాం**

ఈ 'అక్రమ కేసులు'పై తీవ్ర నిరసన తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అధికారికంగా లేఖ రాస్తామని రేవంత్రెడ్డి ప్రకటించారు. "సోనియా, రాహుల్పై ఈ విధమైన దాడులను మేము సహించం. తెలంగాణ ప్రజలంతా గాంధీ కుటుంబానికి అండగా నిలుస్తారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం మా బాధ్యత" అని అన్నారు. గాంధీభవన్లో జరిగిన ఈ సమావేశానికి అనేకమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు, జిల్లాల అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. గాంధీ కుటుంబం పట్ల తెలంగాణ కాంగ్రెస్ బలమైన ఐక్యతను ఈ సభ మరోసారి చాటిచెప్పిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# తెలంగాణ రాజ్భవన్.. ఇక 'లోక్భవన్'

- వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా పేర్లు మార్చాలని కేంద్రం నిర్ణయం
- లోక్ భవన్, లోక్ నివాస్లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర హోంశాఖ లేఖ
- ఇప్పటికే పేర్లు మార్చిన బెంగాల్, తమిళనాడు, గుజరాత్, కేరళ, అసోం, త్రిపుర, ఒడిశా

హైదరాబాద్, ప్రజాస్వరం :

తెలంగాణ రాజ్భవన్ పేరును ఇకపై 'లోక్భవన్' గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దేశంలోని అన్ని రాజ్భవన్ల పేర్లను లోక్భవన్గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

**వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు..**

రాజ్భవన్ మరియు రాజ్ నివాస్ల పేర్లను లోక్భవన్ మరియు లోక్నివాస్లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇటీవల లేఖ రాసింది. ఈ సూచనలు వలసవాద (కాలనీయల్) వాసనలను తుడిచిపెట్టేందుకు ఉద్దేశించినవి.కేంద్రం లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాలు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా రాష్ట్రాల రాజ్భవన్లను లోక్భవన్లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో తెలంగాణ కూడా చేరింది.




# పనుల్లో వేగం, నాణ్యత, స్పష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

రూపకల్పన పురోగతితో పాటు ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై భట్టి విక్రమార్క వివరంగా చర్చించారు. సమ్మిట్ విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటైన పలు కమిటీల పనితీరు, బాధ్యతలు, ఇప్పటి వరకు పూర్తయిన వర్క్ ఫ్లోపై అధికారులతో సమీక్షించారు. ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, వేదిక, లాజిస్టిక్స్, ట్రాన్స్పోర్ట్, ప్రోగ్రామ్ నిర్వహణ, కల్చరల్ ఈవెంట్స్, కమ్యూనికేషన్, డిజిటల్ మీడియా కమ్యూనికేషన్ వంటి కీలక విభాగాల కమిటీ అధ్యక్షులు, టీమ్ సభ్యులతో ప్రత్యేక భేటీలు నిర్వహించిన డిప్యూటీ సీఎం, ప్రతి విభాగంలో జరుగుతున్న పనిని విడివిడిగా సమీక్షించారు. సమీక్ష తర్వాత వార్ రూమ్లో పనిచేస్తున్న ప్రతి బృంద సభ్యుల వద్దకు స్వయంగా వెళ్లి, జరుగుతున్న పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వసతి ఏర్పాట్లు వంటి విషయాలను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం, నాణ్యత, స్పష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి గత కొన్ని రోజులుగా వరుసగా వార్ రూమ్కు వచ్చి, విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై విచారణలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. రేపటి నుంచే రాష్ట్ర మంత్రులూ వార్ రూమ్ను సందర్శించి జరుగుతున్న పనులను పర్యవేక్షించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.



# శాంతి భద్రతల కోసం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్

- ప్రజల్లో నమ్మకం, ధైర్యం పెంపొందిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్ డిసెంబర్ 2( ప్రజాస్వరం) :



దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దౌల్తాబాద్, ధోమ్మట, తిరుమలపూర్ గ్రామాల్లో త్వరలో జరగబోయే గ్రామపంచాయతి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు స్వేచ్ఛగా, భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు బలగాలు మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. కే. నర్సింలు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ గజ్వేల్ . లతీఫ్, సీఐ తొగుట ఆధ్వర్యంలో ఎస్.ఐ జి అరుణ్‌కుమార్ దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది భారీగా ర్యాలీ చేపట్టి గ్రామాల్లో శాంతి భద్రతా వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎవరైనా డబ్బు, మద్యం లేదా ఇతర ప్రలోభాలతో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో శాంతి భద్రతల కోసం అదనపు పోలీసు బలగాలు మోహరించబడతాయని, మహిళలు, వృద్ధులు, యువత సహా ప్రతి ఓటరికి భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌తో గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనడమే కాకుండా, ప్రజల్లో నమ్మకం, ధైర్యం పెరిగేలా అవగాహన కల్పించిందని గ్రామస్థులు తెలిపారు.




# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- గ్రామంలో ఫ్లాగ్ మార్చ్

దౌల్తాబాద్, డిసెంబర్ 02( ప్రజాస్వరం) :



గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవని తొగుట సిఐ లతీఫ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని రాంసాగర్. వడ్డేపల్లి తో పాటు పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించడానికే గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు నిర్భయంగా పోలింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడరాదని ప్రజలను హెచ్చరించడమైనది. ఎవరైన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ లేదా బహిరంగ సభ నిర్వహించాలంటే తప్పనిసరిగా సంబంధిత మండల తహసీల్దార్, పోలీస్ వారి నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎవరైనా ర్యాలీలు లేదా సమావేశాలు నిర్వహించినట్లయితే అట్టి వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. ఎలాంటి ఫిర్యాదులు, అనుమానాలు ఉన్నా తక్షణమే నంబర్ 8712667352 కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అల్లర్లు సృష్టించాలని చూసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కుంచం మానస, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయండి




- జిల్లా కోశాధికారి భాస్కర్

దౌల్తాబాద్ డిసెంబర్ 02( ప్రజాస్వరం ) :

సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలకేంద్రంలో వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. అనంతరం సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల.భాస్కర్ మాట్లాడుతూ కార్మిక,ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు 2025 డిసెంబర్ 79 తేదీల్లో మెదక్ పట్టణంలో జరుగుతున్నాయని తెలిపారు.ఈ మహాసభల సందర్భంగా డిసెంబర్ 7న మెదక్ పట్టణంలో జరిగే కార్మిక మహా ప్రదర్శన బహిరంగ సభకు కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ బహిరంగసభకు ముఖ్యతిథీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు ,సీఐటీయూ అఖిలభారత అధ్యక్షురాలు కే.హేమలత పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.ఈ మహాసభలకు అంగన్వాడీ,ఆశా ,బీడి, గ్రామ పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, మెడికల్, హెల్త్, మధ్యాహ్న భోజన,మెప్మా, ఆర్పి, విఓఏ, ఆటో, హామాలీ,భవన నిర్మాణ, పరిశ్రమల కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు.ఈ కోడ్ ల వలన కార్మికులు అనేక హక్కులను కోల్పోయి బానిసలుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న దరులకు అనుకూలంగా కనీస వేతనాలు నెలకు 26000 రూపాయలు అమలు చేయాలని తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు స్వామి,దాదేకాన్, నీకేన్ కాన్ బాలమణి,షాహిన్ సుల్తాన్,కౌసల్య,మంజుల, లక్ష్మి, సుకన్య, కనకలక్ష్మీ,రజిత, లావణ్య పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- వికారాబాద్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా

వికారాబాద్, డిసెంబర్ 2(ప్రజా స్వరం):



వికారాబాద్ జిల్లా ,వికారాబాద్ నవాబ్ పెట్, మండలాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా. మంగళవారం వికారాబాద్ మండలం సిద్దలుర్ ,నవాబ్ పేట్ మండలం నవాబ్ పెట్, ఏక్మామిడి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్ ల ప్రక్రియ ను పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్క్ ద్వార సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్నీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. అనంతరము కల్లెక్ట్రేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు. సాదారణ పరిశీలకులతో పాటు జిల్లా పంచాయతి అధికారి జయసుధ, డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ డి ఓ వాసు చంద్ర, డిప్యూటీ కలెక్టర్ పూజ ,ఎం పి డి ఓలు నవీన్ కుమార్, తదితరులు ఉన్నారు.

# ప్రతీ ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

- ప్రభుత్వ చీఫ్ వీప్ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు, డిసెంబర్ 2 (ప్రజా స్వరం) :

ప్రతి ఒక్కరూ ధార్మికత, దైవ భక్తిని కలిగి ఉండాలని తెలంగాణ శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ వీప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తాండూర్ మండలంలోని అంతారం గ్రామంలో ఆయన పర్యటించి నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామి ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఆలయాన్ని భక్తి శ్రద్ధలతో పునః నిర్మాణం చేయడం సంతోశమన్నారు. దేవాలయం అభివృద్ధికి తన వంతుగా సహకారం చేస్తానని చెప్పారు. టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డే శీను, మాజీ ఎంపి టీసీ శాంతు, గడ్డిల రవి, గ్రామస్తులు ప్రభాకర్ రెడ్డి, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచులకు 65, వార్డులకు 219 నామినేషన్లు



నార్సింగి, డిసెంబర్ 0 3 (ప్రజా స్వరం) :

నార్సింగి మండల వ్యాప్తంగా రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. నామినేషన్ చివరి రోజు సర్పంచ్ అభ్యర్థుల కోసం 34 నామినేషన్లు రాగా వార్డ్ ల వారిగా 112 నామినేషన్లు అందాయని స్థానిక ఎంపీడీఓ వంగా ప్రీతీ రెడ్డి తెలిపారు. తొలి రోజు మొత్తం 12 నామినేషన్ల లో సర్పంచ్ స్థానాల కోసం మండల వ్యాప్తంగా 3 నామినేషన్లు రాగా, వార్డు సభ్యుల కోసం 9 నామినేషన్లతో మొత్తం 12 నామినేషన్లు వచ్చాయి. రెండవ రోజు మొత్తం 127 నామినేషన్లకు సర్పంచ్ స్థానాల కోసం 27 వార్డు సభ్యుల కోసం 97 వచ్చాయి. మొత్తం మీద మూడు రోజుల నామినేషన్ ప్రక్రియ లో తొమ్మిది గ్రామ పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థిత్వానికి 65 నామినేషన్లు రాగా ఎనభై వార్డు సభ్యుల స్థానాల కొరకు 219 నామినేషన్లు అందాయి. మండలం లో నామినేషన్ ల ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగిందని, ఏర్పాట్లు చేసిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, సహకరించిన మండల నాయకులు, ప్రజలకు ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రీతి రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.




# నర్సంపల్లి సర్పంచ్‌గా లక్ష్మియాదయ్య ఏకగ్రీవం

దౌల్తాబాద్ డిసెంబర్ 2 (ప్రజాస్వరం) :



దౌల్తాబాద్ మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి దుబాసి లక్ష్మి యాదయ్య ని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అభివృద్ధి దిశగా గ్రామాన్ని ముందుకు నడిపించగల నాయకత్వం లక్ష్మి దేనని గ్రామ ప్రజలు ఒక గొంతుతో నమ్మకం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళా సంఘాలు, రైతు సంఘాలు అన్నివర్గాల ప్రజలు ఒకే మాటగా కలిసి సమావేశమై, గ్రామ శాంతి సౌహార్ధాలు కాపాడడం, అనవసర పోటీలు, విభేదాలు లేకుండా గ్రామాభివృద్ధి కోసం ఏకగ్రీవాన్ని సాధించామని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామ అవసరాలు అర్థం చేసుకుని, ఎవరిని అడిగినా అందుబాటులో ఉండే వ్యక్తిత్వం దుబాసి లక్ష్మి గారిది. అభివృద్ధి కోసం పనిచేసే అవకాశం ఇవ్వాలని అందరం నిర్ణయించుకున్నాం అని పేర్కొన్నారు. ఏకగ్రీవ ప్రకటన అనంతరం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు బళ్లతో హర్షధ్వానాలు చేసారు. యువత శుభాకాంక్షలు తెలియజేస్తూ లక్ష్మి యాదయ్య దంపతులను మాలలతో సత్కరించారు. దుబాసి లక్ష్మి యాదయ్య మాట్లాడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లటానికి అందరితో కలిసి కృషి చేస్తాను. ఎవరైనా చెప్పే చిన్న సమస్య కూడా పక్కకు పెట్టకుండా పరిష్కారం కోసం ముందుండి పనిచేస్తా అని హామీ ఇచ్చారు.






# అంచెలంచెలుగా ఎదిగిన నాట్య మయూరి

- **భరతనాట్యంలో తనదైన ముద్ర వేస్తున్న కామెడీ నిత్యవరలక్ష్మిరెడ్డి**
- **"చదువు, నాట్యం రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు"**

**గజ్వేల్, డిసెంబర్ 02 ప్రజాస్వరం :**

నాలుగేళ్ల ప్రాయంలోనే డ్యాన్స్ మీద ఆసక్తి చూపింది ఆ చిన్నారి. చదువే కాకుండా ఇతర అంశాల్లో కూడా ప్రవేశముంటే బాగుంటుందని భావించారు ఆమె తల్లిదండ్రులు. కళలను నేర్పిస్తే క్రమశిక్షణ అలవడుతుందనేది వారి ఉద్దేశం. అలా సరదాగా ఆ చిన్నారినికి భరత నాట్య శిక్షణ ఇప్పించారు. ఏడేళ్ల వయసులోనే నాట్యం వైపు బుడిబుడి అడుగులు వేసి పట్టుదలగా సాధన చేసి తన ప్రతిభను చాటుతోంది. తాను పుట్టిన ఊరు మద్దూర్ మండలం, సాలక్ పూర్ ను దాటి విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగింది. భరత నాట్యంలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్న ఇంజినీరింగ్ పూర్తి చేసిన నిత్యవరలక్ష్మీరెడ్డి(23) గురించి మనమూ తెలుసుకుందాం.

స్వస్థలం సిద్దిపేట జిల్లా, మద్దూరు మండలంలోని సలాక్ పూర్ కామెడీ నిత్యవరలక్ష్మి సొంతూరు. కామిడి నర్సింహారెడ్డి, మంజులారెడ్డి ఆమె తల్లిదండ్రులు. తండ్రి ములుగు మండలంలో GPO, తల్లి వర్గల్ మండలం తునికి ఖల్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు. తమ బిడ్డకు చదువుతో పాటు ఏదైనా ఒక కళలో ప్రవేశం ఉండాలని తల్లి మంజులారెడ్డి భావించారు. కళలో నైపుణ్యాన్ని పెంచుకుంటే చదువులోనూ మరింత బాగా రాణించడానికి వీలవుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలా ఏడో ఏటనే శ్రీరామ నాటకనికేతన్ గురువు శ్రీమతి మంజులా రామస్వామి వద్ద శిక్షణలో చేర్పించారు. తొలి రోజు నుంచే నాట్యంలోని మెలకువలను నేర్చుకునే అంశమై నిత్యవరలక్ష్మీ రెడ్డి దృష్టిపెట్టింది. ఎన్ని అవాంతరాలు వచ్చినా సాధన మాత్రం వీడలేదు.

అలా పాఠశాల, కళాశాలల స్థాయిలో ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టి ఒక్కో మెట్టూ పైకెక్కుతూ వస్తోంది.

## నాట్యం చదువు రెండింటినీ సమన్వయం చేసుకుంటూ!

నిత్య వరలక్ష్మీరెడ్డి విదేశాలలో ఉన్నత చదువులు పూర్తి చేసింది. చిన్ననాటి నుంచి అటు చదువు, ఇటు నాట్యం.. ఈ రెండు అంశాలకూ సమప్రాధాన్యం ఇస్తూ సమయాన్ని వినియోగించుకుంటోంది నాట్య శిక్షణ కోసం అదనంగా సమయం కేటాయించాల్సి వచ్చినా చదువును ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు.

## 400లకు పైగా ప్రదర్శనలు!

మనదేశంతో పాటు విదేశాల్లోనూ కలిసి ఇప్పటి వరకు ఆమె 500లకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. తను తొమ్మిదో తరగతిలో ఉండగా ఆఖిల భారత సాంస్కృతిక సంఘ్ పుణేలో నిర్వహించిన ప్రదర్శనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి కళాకారులు వచ్చారు. ఈ పోటీల్లో నిత్యవరలక్ష్మి మొదటి బహుమతి సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ ప్రదర్శన ఇచ్చినా తనదైన ప్రతిభతో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 2021 భారత స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ,ప్రధానమంత్రి సమక్షంలో రాష్ట్రపతి భవనంలో భరతనాట్య ప్రదర్శన చేసింది. జీ–20 దేశాల సదస్సుల్లోనూ తన ప్రదర్శనతో అందరికీ ఆకట్టుకుంది. భారత ప్రభుత్వం తరపున మలేషియా దేశంలో తన సత్తా చాటింది. రాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా అయోధ్యలోనూ ప్రదర్శన ఇచ్చే అవకాశాన్ని దక్కించుకుంది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి భరతనాట్యంలో విషారథ్ ప్రథమ్ డిగ్రీ పట్టా సాధించింది. 24/01/2024 వ తేదీన రవీంద్రభారతిలో భరతనాట్యంలో అరంగేట్రం చేశారు. మద్దూరు మండలంలో మారుమూల గ్రామం అయినా సలాక్ పూర్ నుండి ఇతర దేశాల్లో మా గ్రామస్తురాలు నాట్య ప్రదర్శన చేయడం చాలా గర్వంగా ఉందని సలాక్ పూర్ గ్రామస్థుల ఆనందం వ్యక్తం చేశారు.

“ఏదో ఒక కళలో ప్రవేశముంటే పిల్లలు క్రమశిక్షణతో మెలుగుతారు. ఒక టీచరుగా నాకు ఈ విషయంలో స్పష్టత ఉంది. అందుకే మా అమ్మాయికి నాట్యం నేర్పించాలని అనుకున్నాం. ఏడేళ్ల వయసులో ఉండగానే శిక్షణలో చేర్పించాం. కానీ తను చాలా పట్టుదలగా నాట్యం నేర్చుకుంది. వందల ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు దక్కించుకుంటోంది. అలా అని చదువును ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. తను చదువులోనూ ముందంజలో ఉంది. తల్లిదండ్రులుగా మమ్ముల్ని గర్వపడేలా చేస్తోందనీ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.





# పోలీసులు సమన్వయంతో పనిచేయాలి

- **జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్, డిసెంబర్ 2(ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మోమిన్పేట్ మరియు నవాబ్పేట్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ల ఆవరణలను, స్టేషన్లోని రికార్డులను, రిసెప్షన్ మరియు వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ల నిర్వహణ మరియు సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం మోమిన్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోమిన్పేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని, ఎంపిడిఓ కార్యాలయంలోని డిఆర్సి కేంద్రాన్ని సందర్శించి అక్కడి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. తదనంతరం నవాబ్పేట్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసి, ఆ పరిధిలోని ఏక్ మామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కూడా సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు అధికారులను మరియు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి మరియు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా తమకు కేటాయించిన పోలింగ్ లొకేషన్ల యొక్క భౌగోళిక పరిస్థితులు, గత ఎన్నికల చరిత్ర, మరియు అక్కడ ఉన్న సున్నితమైన అంశాల గురించి ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, టీమ్ వర్క్ తో పని చేయాలని, ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.



# టీఆర్పీ జిల్లా సహాయ కార్యదర్శిగా గెలంక స్వామి

**గజ్వేల్ డిసెంబర్ 02 ప్రజస్వరం :**


తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శిగా గెలంక స్వామి నియమిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్బగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తానని, బీసీల ఆత్మగౌరవాన్ని పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# ఔటర్ రింగు రోడ్డు వరకు సిటీనే

**ప్రజాస్వరం, హైదరాబాద్ :**

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిని విస్తరించి, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నవంబర్ 25న జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశంలోనూ ఈ అంశాన్ని టేబుల్ ఎజెండాగా పెట్టి ఆమోదించారు. అయితే, కాగితంపై ఈ నిర్ణయం ఎంత అద్భుతంగా కనిపిస్తుందో.. ఆచరణలో దీని వెనుక అంతటి కఠినమైన సవాళ్లు ఉన్నాయన్నది పాలనా నిపుణుల మాట. అసలు ప్రభుత్వం ఎందుకు ఈ నిర్ణయం తీసుకుంది.. దీని వల్ల సామాన్యుడికి ఒరిగేదేంటి..? క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిక్కుముడులేంటి..? జీహెచ్ఎంసీని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యం వినడానికి బాగానే ఉన్నా.. ఆచరణ లో మాత్రం అడుగడుగునా సవాళ్లు ఎదురుకానున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం కోటికి పైగా జనాభా ఉంది. విస్తరణ తర్వాత 2 కోట్లకు పెరగనుంది.అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో దాదాపు సగం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధి ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్లు. విస్తరణ తర్వాత దాదాపు 2,735 చదరపు కిలోమీటర్ల వరకు ఉండనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ వార్షిక బడ్జె ట్ 8 వేల కోట్లు దాటగా.. విస్తరణ తర్వాత రూ.15 వేల కోట్లు దాటే అవకాశాలున్నా యి. విలీనం జరిగితే ప్రభుత్వం ముందుకు వచ్చే అత్యంత క్లిష్టమైన సమస్య సిబ్బంది కొరత. ప్రస్తుతం 650 చ.కి.మీ పరిధిలో ఉన్న జీహెచ్ఎంసీనే సిబ్బంది కొరతతో అల్లాడుతోందిపారిశుధ్య కార్మికులు, దోమల నివారణ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే చెత్త సేకరణ, రోడ్ల నిర్వహణ కష్టంగా ఉంది. ఇప్పుడు అదనంగా 1400 చ.కి.మీ విస్తీర్ణం వచ్చి చేరితే.. ఈ సమస్యలను ఎలా పర్యవేక్షిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కొత్తగా వేలసంఖ్యలో ఉద్యోగులను నియమించే ఆర్థిక స్తోమత ప్రభుత్వానికి ఉందా అన్నది ప్రశ్నార్థకమే. సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించినా, వారి జీతభత్యాలు తడిసి మోపెడవుతాయి.సిబ్బందిని పెంచకుండా విలీనం చేస్తే.. అటు నగరంలో నూ, ఇటు శివార్లలోనూ సేవలు పడకేసే ప్రమాదం ఉంది. శివారు ప్రాంతాల్లో ఇంకా చాలా చోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. సెప్టిక్ ట్యాంకులపైనే ఆధారపడుతున్నారు. జీహెచ్ఎంసీలో కలిపాక వాటన్నిం టికీ డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వాలంటే వేల కోట్లు ఖర్చవుతుంది. అలాగే మంచినీటి సరఫరా కోసం జలమండలి తన నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించాలి. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్లు శివా రు కాలనీల దాహార్తిని తీర్చలేకపోతున్నాయి.ప్రభుత్వం ప్రస్తుతం పన్నులు పెంచబోమని చెబుతున్నప్పటికీ.. ఏకీకృత పాలన వ చ్చాక పన్నుల ఏకీకరణ తప్పనిసరి అవుతుంది. ప్రస్తుతం చిన్న మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను తక్కువగా ఉంది. జీహెచ్ఎంసీలో విలీనమైతే.. నగరంతో సమానంగా కాకపోయి నా, ప్రస్తుతం ఉన్నదాని కంటే కచ్చితంగా పన్నులు పెరుగుతాయి. చెత్త సేకరణ ఛార్జీ లు, నీటి బిల్లులు, నాలా పన్ను వంటివి అదనపు భారం కావచ్చు. ఇది మధ్యతరగతి ప్రజ లకు ఆందోళన కలిగించే అంశం. 2007లో అప్పటి ప్రభుత్వం 12 మున్సిపాలిటీలను కలిపి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసింది.అల్వాల్, ఉప్పల్, కాప్రా, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ వంటి ప్రాంతాలు నగరంలో కలిశాయి. విలీనమై 17 ఏళ్లు గడిచినా .. మల్కాజ్‌గిరి, ఉప్పల్, కాప్రా వంటి ప్రాం తాల్లో నేటికీ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లు మునిగిపోతున్నాయి. అంటే, కేవలం విలీనం చేసినంత మాత్రాన అభివృద్ధి జరగదని తేటతెల్లమైంది. సరైన ప్రణాళిక, సరిపడా నిధులు లేకుండా విలీనం చేస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, ఈసారి పక్కా ప్రణాళికతో వెళ్తేనే ఫలితం ఉంటుందని వారు చెబుతున్నారు.విలీన నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి మాత్రం పెద్ద వరంగా మారనుంది. జీహెచ్ఎంసీ లిమిట్స్ అనే ట్యాగ్ పడితే చాలు.. భూముల రేట్లు అమాంతం పెరుగుతాయి. పెద్దఎత్తున వెంచర్లు, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు వస్తాయి. బిల్డింగ్ పర్మిషన్లు సులభతరం అయితే ద్వారా నిర్మాణ రంగం ఊపందుకుంటుంది. రిజిస్ట్రేషన్లు, బిల్డింగ్ పర్మిషన్ల ద్వారా ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతుందిఅయితే, ఓఆర్ఆర్ లోపల ఇంకా వందలాది గ్రామాలు, వ్యవసాయ భూములు ఉన్నాయి. విలీనంతో ఈ ప్రాంతాల్లో పట్టణీకరణ వేగవంత మై.. గ్రామీణ సంస్కృతి, వ్యవసాయం పూ ర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురై కాంక్రీట్ జంగిల్‌స్గా మారే ముప్పు లేకపోలేదు. హై డ్రా వంటి సంస్థలు ఉన్నా.. రియల్ మాఫియాను అడ్డుకోవడం సవాలే.జీహెచ్ఎంసీ విస్తరణ అనేది కాలగమనంలో జరగాల్సిన పరిణామమే. అంతర్జాతీ య నగరంగా ఎదగాలంటే ఇది అవసరం. కానీ, ఇది కేవలం సరిహద్దులు మార్చే ప్రక్రియగా మిగిలిపోకూడదు. సామాన్యుడికి మెరుగైన జీవన ప్రమాణాలు, నాణ్యమైన రోడ్లు, స్వచ్ఛమైన నీరు, కాలుష్యరహిత వా తావరణం అందించినప్పుడే ఈ మెగా సిటీ కల సాకారం అవుతుంది. లేదంటే, సమస్య ల చదరంగంలో హైదరాబాద్ మరో క్లిష్టమైన పరిస్థితిలో బందీ అవుతుంది. బ్రాండ్ హైదరాబాద్ ఇమేజ్ పెంచే క్రమంలో.. బస్తీవాసుల బతుకులు చిత్రవధ కాకుండా చూ డాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.విలీనమవుతున్న 27 మున్సిపాలిటీల్లో ఆర్థికంగా భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. ము న్సిపాలిటీలుగా మణికొండ, నార్సింగి, కొం పల్లి, బండ్లగూడ జాగీర్, తెల్లాపూర్ వంటివి రియల్ ఎస్టేట్ బూమ్‌తో కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అక్కడ మౌలిక వసతులు కొంత మెరుగ్గా ఉన్నాయి. పూర్ మున్సిపాలిటీలుగా జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగా రం, తుక్కుగూడ, జల్‌పల్లి వంటి మున్సిపాలిటీలు ఆదాయం లేక, కనీస రోడ్లు, డ్రైనేజీ లేక సతమతమవుతున్నాయిఅయితే ధనవంతులైన మున్సిపాలిటీల నుంచి వచ్చే మి గులు ఆదాయాన్ని, పేద మున్సిపాలిటీల అభివృద్ధికి మళ్లించే అవకాశం ఉంది. దీనివల్ల సమతూకం వస్తుందని ప్రభుత్వం భావి స్తోంది. మణికొండ, నార్సింగి వాసులు తమ పన్నుల డబ్బు తమ ప్రాంత అభివృద్ధికి కా కుండా వేరే చోటికి మళ్లిస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇది భవిష్యత్తులో స్థానికంగా అసంతృప్తికి దారితీయవచ్చు.భవిష్యత్ పరిపాలన ఎలా ఉండాలి?.. విలీనం విజయవంతం కావాలంటే ప్రభు త్వం ఈ కింది చర్యలు తప్పక తీసుకోవాలని పట్టణ ప్రణాళిక నిపుణులు సూచిస్తున్నా రు. మొత్తం నగరాన్ని ఒకే కమిషనర్ పాలించడం అసాధ్యం. ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 10` నుంచి 12 జోన్లకు పెంచాలి. జోనల్ కమిషనర్లకు పూర్తి ఆర్థిక, పరిపాలన అధికారాలు ఇవ్వాలి. చిన్న చిన్న సమస్యలకు హెడ్ ఆఫీస్ చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు.విలీన ప్రాంతాల అభివృద్ధికి వచ్చే ఐదేళ్ల పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. కేవలం అక్కడి పన్నుల ఆదాయంపైనే ఆధారపడకుండా.. ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో నిధులు ఇవ్వాలి.యుద్ధ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయాలి. ప్రతి 500 ఇళ్లకు ఒక పారిశుధ్య కార్మికుడు ఉండేలా చూడాలి. ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న గ్రోత్ కారిడార్లలో ప్రజా రవాణాను మెట్రో, బస్సులు విస్తరించాలి. లేదంటే ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ భారీ నిర్ణయం వెనుక ప్రధానంగా మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. సమగ్ర అభివృద్ధి ప్రస్తుతం కోర్ సిటీ పాత ఎంసీహెచ్ ఒకలా, విలీన ప్రాంతాలు మరోలా, శివారు మున్సిపాలిటీలు ఇంకోలా అభివృద్ధి చెందుతున్నాయిఒక రోడ్డు వేయాలన్నా, డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలన్నా.. ఒక మున్సిపాలిటీ దాటగానే మరో మున్సిపాలిటీ అనుమతులు, నిధుల కొరత అడ్డంకిగా మారుతోంది. ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని ఒకే పాలనా గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా మాస్టర్ ప్లాన్‌ను ఏకతాటిపై అమలు చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కాప్రా, బేగంపేట్ సర్కిళ్లలో ఈ ప్రక్రియ పూర్తయిందని, 28 సర్కిళ్లలో పనులు జరుగుతున్నాయని సమాచారం.






# కన్నీళ్లు తెప్పిస్తున్న రైతు ఆత్మహత్య

**ప్రజాస్వరం, ఖమ్మం :**

వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎన్నో నష్టాలు వస్తున్నాయని, అతికష్టమ్మీద పంట పండిస్తే దానికి మద్దతు ధర రాదని ఆవేదన వ్యక్తం చేస్తూ కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని, ఎక్కువ మద్దతు ధర ఇవ్వాలని, సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని.. తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బానోతు వీరన్న సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుల మందు తాగిన తరువాత తమ బాధను చెప్పుకుంటూ తీసిన సెల్ఫీ వీడియో వైరల్ అవుతోంది. రైతు ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. పురుగుల మందు తాగుతూ.. పండిరచిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నానని.. మద్దతు ధర కల్పించాలని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలకు నిదర్శనం అని విమర్శించారు.కౌలు రైతు వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్య. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా ఆర్థిక తోడ్పాటు లేక, అప్పులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, ఓట్లు వేశాక రైతులను మోసం చేయడం దుర్మార్గం. పండిరచిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో రైతు వీరన్న చెప్పిన మాటలకైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం వస్తుందా?. ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు. ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు?' అని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కలిసి పోరాటం చేద్దాం. తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని' హరీష్ రావు అన్నదాతలకు సూచించారు.

# వైన్ షాపు వద్దని మహిళల అందోళన



- **మద్దతు పలికిన బీజేపీ నేతలు**

**ప్రజాస్వరం, ఖమ్మం. :**

నగరంలోని 3 టౌన్ బొక్కలగడ్డ ప్రాంతంలో వైన్ షాప్ ముందు బిజెపి ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఆందోళనకు దిగారు. మహిళల ఆందోళనకు బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు మద్దతు తెలిపారు. వైన్ షాప్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వాసుదేవరావుకు స్థానిక మహిళలు వివరించారు. వైన్ షాప్ ఉండటం వల్ల కనీసం రోడ్డు పై నడిచే పరిస్థితి లేదని మహిళలు వాపోయారు. వైన్ షాపు వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులకు, అధికారులకు దృష్టికి తీసుకువెళ్లామని స్థానిక మహిళలు తెలిపారు. సర్దు చెప్పేందుకు వచ్చిన పోలీసులకు సమస్యను వివరించారు. వైన్ షాపును ఇక్కడ తరలిస్తామని లిఖితపూర్వకమైన హామీ ఇప్పించాలని విజ్ఞప్తి చేసారు. తక్షణమే బొక్కలు గడ్డ ప్రాంతంలో ఉన్న వైన్ షాప్ ను తరలించాలని డిమాండ్ చేసారుర. ఈ నేధ్యంలో ఆందోళన చేస్తున్న బిజెపి నాయకులు,స్థానికులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది.

# హైదరాబాద్ సిటీపై కోకాపేట ఎఫెక్ట్

**ప్రజాస్వరం, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో ఇప్పుడు ఔటర్ రింగ్ రోడ్ సవిూపానికి వెళ్లి ఓ 1000 ఎస్ఎఫ్టీ అపార్టుమెంట్ కొనుక్కోవాలంటే కనీసం కోటి రూపాయలు అవుతోంది. ఇక స్కై స్క్రాపర్లలో అయితే కనీసం రెండు కోట్లు అవుతోంది. ఓ మధ్యతరగతి జీవి .. కోటి పెట్టి ఇల్లు కొనగలరా?. రూ. 50 లక్షలు అయితేనే జీవితాంతం ఈఎంఐ కట్టుకుంటూ ఓ ఇల్లు కొనగలరు?. అలాంటి పరిస్థితుల్లో భూముల రేట్లను వేలం పెట్టి మరీ రికార్డుల మీద రికార్డులు సృష్టించే దిశగా అమ్ముతూంటే.. ఇక మధ్యతరగతికి అందుబాటులో ఇళ్లు ఉంటాయా?ప్రభుత్వం కోకాపేట్‌లో భూములు వేలం వేస్తోంది. ఒక్క ఎకరానికి 150 కోట్లు దాటిపోతోంది. ఈ ధరలు చూస్తుంటే సామాన్యులకు ఇల్లు కొనడం కలలా మారిపోయింది. ఈ వేలాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బాగా లాభం చేస్తున్నాయి. బడా రియల్ ఎస్టేట్ సంస్థలు భూములు కొని లగ్జరీ ఫ్లాట్లు కడుతున్నాయి. కోకాపేటలో ఒక్కో ఫ్లాట్ 4 నుంచి 10 కోట్ల వరకు ఉంటుంది. ఈ ఫ్లాట్లు కొనేవాళ్లు కేవలం బాగా సంపాదించే వాళ్లే. కోకాపేట్ ధరలు పెరిగితే దాని పక్కనే ఉన్న మణికొండ, నర్సింగి, గచ్చిబౌలి ధరలు కూడా పెరుగుతాయి. ఆ తెల్లాపూర్, ఆ తర్వాత కొల్లూరు వరకూ ఇప్పుడు మధ్యతరగతి వాళ్లు హైదరాబాద్‌లో ఇల్లు కొనాలంటే కనీసం 1.5 నుంచి 2 కోట్లు కావాలి. ప్రభుత్వానికి వేలం ద్వారా వేల కోట్లు వస్తున్నాయి. ఆ డబ్బుతో రోడ్లు, మెట్రో విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు చేస్తామని అంటోంది. కానీ పథకాల అమలు కోసమే అని అందరికీ తెలుసు. ఇప్పుడు హైదరాబాద్‌లో రెండే రకాల ఇళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి ? చాలా ఖరీదైన లగ్జరీ ఫ్లాట్లు, లేదా నగరం బయట చాలా దూరంలో ఉండే చిన్న ఫ్లాట్లు. మధ్యలో మధ్యతరగతి వాళ్లకు తగిన ఇళ్లు దాదాపు లేవు. గతంలో బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్ మాత్రమే ఖరీదుగా ఉండేవి. ఇప్పుడు కోకాపేట్, గచ్చిబౌలి కూడా అలాంటి స్థాయికి వచ్చేశాయి. ఇక హైదరాబాద్ నగరం మొత్తం మధ్యతరగతి వారికి ఇల్లు లేదు అన్నట్టు మారిపోతోంది. ప్రభుత్వం ఇలాగే వేలాలు పెడుతూ పోతే రేపు మధ్యతరగతి



వాళ్లు నగరం బయటకు వెళ్లిపోవాల్సి వస్తుంది. లేదా ఇల్లు కొనే కలనే వదులుకోవాల్సి వస్తుంది. డబ్బు ఉన్నవాళ్లకు హైదరాబాద్ స్వర్గం అయిపోతోంది. డబ్బు లేని వాళ్లకు ఇక్కడ స్థలం లేకుండా పోతోంది.ప్రభుత్వం ఆదాయం మాత్రమే చూసుకుంటోంది. వేలం వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పును ఊహించడం లేదు. కొంత మంది బిల్డర్లు భారీగాఖర్చు పెట్టి భూములు కొనుగోలు చేయడం వల్ల ఆ ప్రభావం హైదరాబాద్ మొత్తం పడుతుంది. రియల్ ఎస్టేట్ భూమ్ ఉందని చెప్పి అన్ని చోట్లా ధరలు పెంచుతారు. గత కొంత కాలంగా ఇదే జరుగుతోంది. చిన్న బిల్డర్లు.. ఏ సౌకర్యాలు లేని అపార్టుమెంట్లలోనే ఇప్పుడు డబుల్ బెడ్ రూం 70 లక్షలకు అమ్ముతున్నారంటే.. ఇక సామాన్యుడు ఎలా సొంత ఇంటి కలను నిజం చేసుకోగలడు. హైదరాబాద్‌లో ఒక్క ఐటీ వర్గం... అది కూడా ఉన్న వైట్ కాలర్ జాబ్స్ చేసే వారికి మాత్రమే ప్రస్తుతం ఇళ్ల కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. వారి డిమాండ్ పరిమితం. త్వరలో ఈ బూమ్ బద్దలయ్యే అవకాశం ఉంది.

# గ్రామాల్లో మారుతున్న లెక్కలు

**ప్రజాస్వరం, హైదరాబాద్ :**

గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే మండల వ్యాప్తంగా రాజకీయాలు హాట్ హాట్ గా మారాయి. మండలంలో రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. అయితే సర్పంచ్, వార్డ్ సభ్యులుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహులు ఇప్పటికే రంగంలోకి దూకేశారు. గ్రామాలలో ఏ కోణంలో చూసిన రాజకీయ సమావేశాలు, చర్చలు, లెక్కలు, పంచాయతీ ఎన్నికల జోరు స్పష్టంగా కనిపిస్తున్నది.రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీ సపోర్టు దక్కించుకోవడం గెలుపునకు కీలకమని భావిస్తున్న ఆశావహులు బడా నాయకుల తలుపులు తడుతున్నారు. ఒక్కో పార్టీలో ఐదునుంచి ఆరుమంది. పోటీ పడుతుండడంతో స్థానిక నాయకులు సుక్క ముక్క ఏర్పాటు చేస్తూ అనుచరులను కాపాడుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఎవరికి టికెట్ ఇవ్వాలి? ఎలా ఇవ్వాలనే సందిగ్ధంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఇద్దరూ పార్టీ క్యాడర్ దెబ్బతినకుండా అభ్యర్థిని ఎంపిక చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నుండి టిక్కెట్ ఖరారు చేసే ప్రయత్నంలో ఉంది. కానీ పార్టీ కోసం కష్టపడ్డ వారికి టికెట్ అనే సీఎం మాటలే గ్రామాలలో చర్చ నీయంశనీగా మారాయి.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సాధ్యం కాకపోవడంతో పాత విధానానికే తిరిగింది. దీంతో పలు గ్రామాలలో రిజర్వేషన్లు తారు మారయ్యాయి. సామాజిక కార్యక్రమాల పేరుతో ఇప్పటికే లక్షలు ఖర్చు చేసిన రిజర్వేషన్ మారకపోవడంతో ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ ఏమవుతుందో అన్న ఉత్కంఠ నెలల పాటు కొనసాగి. చివరకు మారిపోవడంతో చాలామంది తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది.సర్పంచ్ ఓటర్ డ్రాఫ్ట్ సిద్ధం కావడంతో గ్రామాలలో ఎన్నికల చర్చలు భగ్గుమంటున్నాయి. ఎక్కడ ఏ ఫంక్షన్ జరిగిన ఆశావహుల హాజరు తప్పనిసరి. మాట్లాడితే గ్రామాభివృద్ధి, చేతులు కలిపితే మేమున్నాము అన్న సందేశం ఇదే ప్రస్తుతం స్థానిక రాజకీయాల దృశ్యం. ఎవరి బలంఎంత? అనుచరులు ఎంత? గ్రామంలో మద్దతు ఎలా? అన్నదానిపై రోజంతా లెక్కలు వేసుకుంటున్నారుదీర్ఘకాలంగా పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, ఇటీవల అధికార పార్టీలో చేరి శ్రమించిన నాయకులు ఇలా ఈ రెండు వర్గాల మధ్య పోటీ మండలంలో చెలరేగుతుంది. లోకల్ నాయకుల సపోర్ట్ కోసం ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూ ఆశావహులు నిత్యం క్యాంప్ చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆశీస్సులు ఉంటే గెలుపు ఖాయం అన్న నమ్మకంతో ప్రతి అభ్యర్థి అండ కోసం పరుగులు పెడుతున్నారుఅధికారంలో లేకపోయినా బి ఆర్ ఎస్ పంచాయతీ ఎన్నికల యుద్ధరంగంలోకి దిగింది. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వయంగా గ్రామాలలో పర్యటిస్తూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.




# కల్తీనెయ్యి... పరకామణి

**ప్రజాస్వరం, తిరుమల :**

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కథ తేల్చే పనికి వేళయింది. కల్తీ నెయ్యి కేసు నిజాలు తేల్చే పనిలో ఉన్న సిట్ ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయబోతోంది. ఇప్పటికే 29 మంది నిందితులను కేసులో చేర్చి పలువురిని విచారించిన సిట్ 9 మందిని అరెస్టు చేసింది. మరికొద్ది మందిని నిందితులుగా చేర్చేందుకు మెమోలు దాఖలు చేసింది. అంతేకాకుండా.. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా, ఈఓలుగా పనిచేసిన వారిని విచారించింది. డెయిరీ యాజమాన్యాలను, నిందితులను జైలుకు పంపింది. ఇప్పుడు టిటిడి అధికారుల అరెస్టులకు సిద్ధం కావడం.. ఇన్వెస్టిగేషన్ స్పీడ్ అవ్వడంతో.. ఉద్యోగుల్లో భయాందోళనలకు కారణం అయ్యింది. నెక్స్ట్ ఎవరంటూ తీవ్ర చర్చ జరుగుతోంది.దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ తుది దశకు చేరుకుంది. ఔఆఆః కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీని గుర్తించిన టిటిడి శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చే పనిలో ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. సీబీఐ నేతృత్వంలోని 5 మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం డిసెంబర్ 15 లోపు ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయాలని నిర్ణయించింది. సిట్‌లో సీబీఐ తరపున మురళి రాంబా కీలకంగా వ్యవహరిస్తుండగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ పని పూర్తి చేస్తోంది. క్షేత్రస్థాయిలో దర్యాప్తు పూర్తి చేసిన సిట్ అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ కేంద్రంగా ఏడాదిగా విచారణ చేస్తోంది.ఇందులో భాగంగానే కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే టీటీడీ ఉద్యోగుల్లో కల్తీ నెయ్యి కేసు భయం నెలకొంది. కేసులో ం29 గా టీటీడీ ప్రొక్యూర్మెంట్ జిఎం గా పనిచేసిన సుబ్రహ్మణ్యం అరెస్ట్ కావడంతో ఫియర్ పిక్స్ కు చేరుకుంది. ఇప్పటికే నిందితులుగా ఉన్న ఉద్యోగులను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని బావిస్తున్న పరిస్థితి వెంటాడుతోంది. అంతేకాకుండా.. పలువురిని విచారించే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం..సుబ్రహ్మణ్యం రిమాండ్ రిపోర్టులో కల్తీ నెయ్యి సరఫరాపై సంచలన విషయాలు బయటపడ్డాయి. కల్తీ నెయ్యిని స్వచ్ఛమైన ఆవు నెయ్యిగా టీటీడీకి సరఫరా జరిగేలా సహకరించింది సుబ్రహ్మణ్యమే నని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. బోలే బాబా డయిరీ నుంచి రూ. లక్షల్లో లంచం, విలువైన కానుకలు సుబ్రహ్మణ్యం అందుకున్నట్లు సిట్ నిర్ధారణకొచ్చింది.బోలే బాబా, వైష్ణవి డయిరీలను తనిఖీ చేయడానికి వెళ్లిన అధికారులు విలువైన వస్తువులు, నగదు పొందినట్లు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది. కేసులో ం24గా ఉన్న చిన్నఅప్పన్నకు సహకరించి నెయ్యి సప్లై చేసిన కంపెనీలతో సుబ్రహ్మణ్యంతో పాటు మరికొందరు లాలూచీ పడినట్లు సిట్ గుర్తించింది. మైసూర్ ల్యాబ్ రిపోర్టును దాచి బోలే బాబా డయిరీ కి రెండు దఫాల్లో దాదాపు 1.20 లక్షల కిలోల దాకా నెయ్యి సరఫరాకు ఆర్డర్ల ను ఇవ్వడంలో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర పోషించినట్లు సిట్ తెలిపింది. నెయ్యి సరఫరాకు సాంకేతికంగా అర్హత పొందిన సంస్థలకు లబ్ది చేకూర్చేలా టెండర్ల ప్రక్రియను నిర్వహించేలా అప్పటి టిటిడి ప్రొక్యూర్మెంట్ జిఎం సుబ్రహ్మణ్యం ప్రయత్నించినట్లు సిట్ పేర్కొంది.మరోవైపు కల్తీ నెయ్యి కేసు దర్యాప్తును ముగించే దశలో ఉన్న సిట్ టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాదులో, టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డిని తిరుపతిలో రెండు రోజులు పాటు విచారించింది. ఇలా కల్తీ నెయ్యి సరఫరా కేసులో అప్పటి పాలకమండలిని, అధికారులను, నెయ్యి సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులను, సహకరించిన వారిని విచారించింది.



## జవహర్ నగర్ చెత్త డంపుతో
# అనేక వ్యాధులు

- **స్థానికుల సమస్యలను పరిష్కరించాలి**
- **ఎంపి ఈటల**

**మేడ్చల్, ప్రజాస్వరం :**

జవహర్ నగర్ డంప్ యార్డ్ ను ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఒకనాడు జనాలు లేనప్పుడు డంపింగ్ యార్డ్ జవహర్ నగర్ లో ఏర్పాటు చేశారు. అప్పుడు 300 టన్నుల చెత్త వేస్తే ఇప్పుడు అది 10 వేల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. దమ్మాయిగూడ జవహర్ నారపల్లి ఘట్కేసర్ వరకు ఉన్న ప్రజలు ఈ డంపింగ్ యార్డు వల్ల ఇబ్బంది పడుతున్నారు. జనావాసాల మధ్య డంపింగ్ యార్డ్ కొనసాగడం దుర్మార్గమని అయన అన్నారు. బీజేపీ కొట్లాడడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీచేస్తే.. అప్పటి ప్రభుత్వం 2017 లో నగరం నాలుగు మూలలా చెత్త డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామని అఫిడవిట్ దాఖలు చేసింది కానీ చేయలేదు. 2021, 22, 25 మూడుసార్లు గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిన కూడా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుంది. చెత్త లారీలు కప్పు లేకుండా తిరగడం వల్ల ప్రజలవిూద ఆ చెత్త పడుతుంది. ఇక్కడ నివసించే లక్షల మంది ప్రజలు ఇళ్లలో, ఫ్యాక్టరీలో పని చేసి బ్రతికే కడు పేద ప్రజలు. వారు కష్టపడి సంపాదించే ప్రతి పైసా హాస్పిటల్ కోసం ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. వాసనతో శ్వాసకోశ వ్యాధులు, కలుషిత నీటితో అనేక జబ్బులు వస్తున్నాయి. చివరికి పిల్లలు కూడా పుట్టడం లేదని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా.. పేద ప్రజల రక్తం తాగుతుంది ఈ ప్రభుత్వం. ప్రజల జీవితాలతో చెలగాటమడుతుంది. నేను ఎంపీ అయ్యాక ప్రభుత్వానికి మొరపెట్టుకున్న కూడా పట్టించుకోవడం లేదు. నగరం నాలుగు మూలలా డంపింగ్ యార్డులు స్ప్రెడ్ చేయమని కోరాం అయినా వినడం లేదు. గ్రామస్థులు ఆక్సిడెంట్స్ తో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. ప్రజలు ఎవరైనా అడ్డుకుంటే డ్రైవర్లతో దాడులు చేయిస్తున్నారు. శంకర్ అనే యువకుడు మీద దాడి చేశారు. సమస్య పరిష్కారం చెయ్యకపోతే, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేయకపోతే చూస్తూ బీజేపీ ఊరుకోదు అని హెచ్చరిస్తున్నాం. గతంలో ఇక్కడ ఎంపీగా పనిచేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాడు, ఆయనకు ఇక్కడి ప్రజల బాధలు తెలుసు సమస్య పరిష్కరిస్తాం అనుకున్నాం అయినా పరిష్కారం కావడం లేదు. తీవ్రంగా హెచ్చరిక చేస్తున్నా. ఒకే దగ్గర చెత్త వేయవద్దు. ఇక్కడ ఉన్న గుండ్ల చెరువునుండి ఎదులాబాద్ చెరువు వరకు అన్ని చెరువులు కలుషితం అయ్యాయి. మూసీ కెమికల్ కంటే ఇది ప్రమాదకరం. భూగర్భ జలాలు కూడా విషపూరితం అయ్యాయి. ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు..

## చంద్రబాబుపై కేసులు క్లోజ్

**విజయవాడ, ప్రజాస్వరం :**



వైఎస్ జగన్ హయాంలో చంద్రబాబుపై పెట్టిన మరో కేసు కోర్టులో తెలిపింది. లిక్కర్ పాలసీ అక్రమాల కేసులో దర్యాప్తు పూర్తయినట్లుగా సీఐడీ కోర్టుకు తెలిపింది. అక్రమాలు జరిగినట్లుగా ఆధారాలేమీ లేకపోవడంతో కేసును క్లోజ్ చేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2023 అక్టోబర్ 30న ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు జరిగాయని సీఐడీ కేసు నమోదు చేసింది. 2014`19 మధ్య ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు, డిస్టిలరీలకు అర్హత లేకపోయినా లైసెన్సులు ఇవ్వడం, కొంతమంది సప్లయర్లకు ప్రయోజనాలు కల్పించారని కేసులు నమోదు చేశారు. సీఎంగా ఉన్న సమయంలో మద్యం తయారీ కంపెనీలకు అనుమతుల విషయంలో చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ అభియోగాలు మోపింది. పీసీ యాక్ట్ తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. కొన్ని మద్యం తయారీ సంస్థలకు ప్రయోజనం చేకూరేలా చంద్రబాబు సర్కార్ వ్యవహరించిందని ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ మేరకు ఏపీ బేవరేజెస్ ఎండీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1 గా సుధాకర్, ఏ2 కొల్లు రవీంద్, ఏ3 చంద్రబాబు పేర్లను ఏపీ సీఐడీ నమోదు చేసింది. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చినప్పటికీ 2023లో రెండు బేవరేజీలు, మూడు డిస్టిలరీలకు లబ్ధి చేకూర్చేందుకు మద్యం పాలసీని మార్చారని అప్పటి ఏబీ బేవరేజెస్ ఎండీ ఫిర్యాదు చేశారు. కొన్ని మద్యం తయారీ సంస్థలకు ప్రయోజనం కలిగేలా 2012 ఎక్సైజ్ పాలసీని మార్చారని .. 2015లో కొత్త ఎక్సైజ్ పాలసీ తీసుకు వచ్చిన ప్రభుత్వానికి పన్నులు రాకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థ ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. అయితే అప్పటి , ఇప్పటికి బేవరేజెస్ ఎండీలు.. ఎలాంటి అవకతవకలు జరగలేదని.. ఆధారాల్లేవని చెప్పినట్లుగా తెలుస్తోంది. ఆధారాలు లేని విషయాన్ని సీఐడీ కోర్టుకు తెలిపింది. దాంతో కోర్టు మూసివేసింది. ఇటీవలే చంద్రబాబుపై గత ప్రభుత్వం పెట్టిన ఫైబర్‌నెట్ కేసును కూడా కోర్టు మూసివేసింది. ఈ కేసులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, సంస్థకు ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లలేదని సీఐడీ దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించి ఫైబర్‌నెట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. మధుసూదన రెడ్డి, ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ ఏసీబీ కోర్టుకు హాజరయ్యి.. సీఐడీ సమర్పించిన తుది నివేదికతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామని, కేసు మూసివేతకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు లిఖితపూర్వకంగా, మౌఖికంగా కోర్టుకు తెలిపారు. దాంతో కేసును కోర్టు మూసివేసింది.



## గంజాయి డాన్
# కామాక్షమ్మకు చెక్

- **ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం**
- **నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపిన కామాక్షమ్మ**

**నెల్లూరు, ప్రజాస్వరం :**

నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిరదని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిరదని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులతోపాటు సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మతోపాటు అమె బంధువులు, అనుచరుల నివాసాలను స్థానికులు కూలగొట్టారు




## దేశంలో ఏడో ర్యాంక్..
# తెలంగాణలో మొదటి స్థానం

- **ఉత్తమ పోలీస్ స్టేషన్గా మెరిసిన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్**

**మేడ్చల్, ప్రజాస్వరం :**

దేశవ్యాప్తంగా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఎంపిక చేసిన ఉత్తమ పోలీస్ స్టేషన్లలో శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ 7వ స్థానాన్ని, తెలంగాణలో మొదటి స్థానాన్ని సాధించింది. పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులకు సమయానుకూల పరిష్కారం చూపించడం వంటి అంశాలను మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ పరిగణనలోకి తీసుకుంది. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, గార్డెనింగ్, ఉత్తమ సీసీటీఎన్ఎస్ పని, సిబ్బంది నైపుణ్యం వంటి అంశాలు కూడా పరిశీలనలో ఉన్నాయి. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేసే ఈ ప్రక్రియలో, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్కు చెందిన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ రాష్ట్రంలో అగ్రస్థానాన్ని, దేశంలో ప్రతిష్టాత్మకమైన ఏడో ర్యాంకును సాధించడం విశేషం. ఈ సందర్భంగా మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏడీసీపీ మేడ్చల్ పురుషోత్తం, శ్రీనాథ్ షావిూర్పేట్ ఇన్స్పెక్టర్ ఏసీపీ పేట్ బషీరాబాద్ బాలగంగిరెడ్డి, శామీర్ పేట్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్తో పాటు సిబ్బందిని అభినందించారు.

## అపోలోలో ఘనంగా
# ఫిజియోథెరపీ గ్రాడ్యుయేషన్ డే



**చిత్తూరు, ప్రజాస్వరం :**

అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్) పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ నిర్వహించిన 2020 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. విద్యా ప్రమాణాల్లో నూతనోత్సాహాన్ని నెలకొల్పుతూ, వరుసగా వంద శాతం ఫలితాలు సాధిస్తూ, మెరుగైన ప్లేస్మెంట్‌లు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన ఈ కళాశాల నుంచి మరో బ్యాచ్ విజయవంతంగా పట్టాలు అందుకోవడంతో, మొత్తం క్యాంపస్ ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ "ఫిజియోథెరపీ పుట్టుక నుంచి జీవనాంతం వరకు ప్రతి దశలో కీలక పాత్ర పోషించే గొప్ప వైద్య రంగం. ప్రపంచవ్యాప్తంగా ఫిజియోథెరపిస్ట్‌లకు అవకాశాలు విస్తృతంగా పెరుగుతున్నాయి. డిగ్రీతో ఆగిపోకుండా స్పెషలైజేషన్లలో ముందుకు సాగుతూ తల్లిదండ్రులు?సంస్థ పేరు, గౌరవం నిలబెట్టాలి" అని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కిరణ్ మాట్లాడుతూ "ఫిజియోథెరపీ మనిషి జీవితంలోని ప్రతి దశకు అవసరమైన వైద్యసేవ. విద్యార్థులు తమ జ్ఞానం, నైపుణ్యాన్ని సేవాభావంతో సమాజానికి అందించాలి" అని కోరారు. ఈ ఏడాది విద్యార్థులంతా తమ ఇంటర్న్‌షిప్‌లను విజయవంతంగా పూర్తి చేసి గ్రాడ్యుయేషన్‌కు అర్హులయ్యారని, ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లు వరుసగా వంద శాతం ఫలితాలు సాధించడం ఈ కళాశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి చేర్చిందని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్లలోనూ కాలేజ్ నిరంతర పురోగతి కొనసాగిస్తోంది. ఈ సంవత్సరం పలువురు విద్యార్థులు అపోలో ఆసుపత్రులలోనే నియామకాలు పొందగా, మరికొందరు ఇతర ప్రముఖ వైద్య సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని డా. కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్‌ఫ్రెడ్ జె. ఆగస్టిన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్‌రెడ్డి పాల్గొని గ్రాడ్యుయేట్లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# కొత్త స్ట్రాటజీలో వైసీపీ



**కాకినాడ, ప్రజాస్వరం :**

వచ్చే ఎన్నికలే ధ్యేయంగా రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. అవి చేయని ప్రయత్నం అంటూ లేదు. తెలుగుదేశం పార్టీ కూటమిలో జనసేన, బిజెపి ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే ఉంది. టిడిపి కూటమికి కాపులతో పాటు కమ్మ సామాజిక వర్గం అండగా ఉంది. మొన్నటి ఎన్నికల్లో బీసీలు సైతం అండగా నిలవడంతో కూటమి ఘనవిజయం సాధించింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గంతో పాటు దళిత ఓటు బ్యాంకు ఉంది. అయితే ఆ రెండు సామాజిక వర్గాల్లో సైతం మొన్నటి ఎన్నికల్లో చిన్నపాటి చీలిక వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయానికి కూడా అది ఒక కారణం. అయితే ఏపీలో పెద్ద సామాజిక వర్గంగా ఉన్న కాపులు ఎవరికి మద్దతు తెలిపితే వారే విజయం సాధిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అదే కాపు సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కాపుల్లో చీలిక తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే దళిత కార్డు ఒకటి బయటకు వచ్చింది. కాపులు, దళితులు కలిస్తే రాజ్యాధికారం తప్పకుండా లభిస్తుందని దళిత వర్గానికి చెందిన ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తోందిదళిత మహాసభల కు సంబంధించిన కార్యక్రమం ఒకటి జరిగింది. అందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐపీఎస్ సునీల్ కుమార్ కాపులతో దళితులు చేతులు కలపాలని.. అప్పుడే కాపులకు దూరమైన రాజ్యాధికారం దక్కుతుందని ఆయన వ్యాఖ్యలు చేశారు. పనిలో పనిగా డిప్యూటీ సీఎం పదవిని జడ శ్రావణ్ కుమార్ లాంటి నేతలు తీసుకోవాలని చెప్పడం ద్వారా అసలు విషయాన్ని చెప్పేసారు. గత కొద్ది రోజులుగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు జడ శ్రవణ్ కుమార్. 2024 ఎన్నికలకు ముందు శ్రావణ్ కుమార్ తెలుగుదేశానికి అనుకూలంగా ఉండేవారు. కానీ ఎన్నికల్లో సరైన ప్రాధాన్యం, ఆపై తాను కోరిన వారికి సీట్లు ఇవ్వకపోవడంతో శ్రవణ్ కుమార్ లో మార్పు వచ్చింది. క్రమేపి ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. మరోవైపు సునీల్ కుమార్ సైతం వైసీపీ హయాంలో ఇంటలిజెన్స్ ఐజిగా పనిచేశారు. అప్పట్లో టిడిపి కూటమి నేతలను వేధించారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సునీల్ కుమార్ నోటి నుంచి కాపులు, దళితులు కలవాలన్న కామెంట్ రావడం.. జడ శ్రవణ్ కుమార్ ప్రస్తావన రావడంతో దాని వెనుక వైసీపీ ప్రయోజనాలు ఉన్నాయని అర్థమవుతోంది.కూటమికి అండగా ఉన్నారు కాపులు. గత కొద్ది రోజులుగా కాపు సామాజిక వర్గం విషయంలో కమ్మ సామాజిక వర్గం దాడులకు తెగబడుతోందని వైసీపీ ప్రచారం చేసుకుంటూ వస్తోంది. కాపులకు సంబంధించిన ఏ అంశం బయటకు వచ్చిన దానిని తెర పైకి తెస్తూ రాజకీయ ప్రయోజనాలను దక్కించుకోవాలని ఉబలాటపడుతోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే ఇప్పుడు దళిత కార్డును ఉపయోగించి? కాపుల్లో చీలిక తెచ్చే ఆలోచనలో ఉన్నట్టు కనిపిస్తోంది. లేకుంటే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దళితులు అండగా ఉంటూ వచ్చారు. వారిలో సైతం మార్పు కనిపిస్తోంది. ఇంకో వైపు చూస్తే కాపులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో లేరు. అందుకే కూటమితో పాటు జనసేనకు అండగా నిలిచే కాపులను డైవర్ట్ చేస్తే.. మిగతా వర్గాలతో ఈజీగా అధికారంలోకి రావచ్చు అని జగన్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే కుల సమీకరణలతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తూ వచ్చింది. టిడిపి హయాంలో ఉన్న కాపు రిజర్వేషన్ ఉద్యమం వైసీపీ రాగానే ఆగిపోయింది. ఇప్పుడు చూస్తుంటే కాపులతో దళితులు చేతులు కలపాలి అన్న డిమాండ్ వచ్చింది. మొత్తానికి అయితే జగన్ గట్టి ప్లానే వేసినట్లు తెలుస్తోంది. మరి అది వర్కౌట్ అవుతుందా? లేదా? చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999